ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -353 పేజీలు - 08 వెల - 04/- శనివారం 22 నవంబర్ 2025



# మూడేళ్లలో 17 లక్షలఇళ్ళు



**కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు**

**యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై ఆరా**

**అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు**

**మత్స్యకారులకు బాబు శుభాకాంక్షలు**

అమరావతి**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**

సంజీవని ప్రాజెక్టును జనవరి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై చర్చించారు. తొలివిడతలో చేపట్టనున్న ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూడా చర్చించారు. విద్యార్థులు, ప్రజలు, సామాజిక ప్రయోజనం కోసం వీటిని ప్రభుత్వం పీపీపీ ప్రాతిపదికన నిర్మిస్తోంది. దీంతో బోధనాసుపత్రులు వేగంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలావుంటే ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సముద్ర తీరం, డెల్టా ప్రాంతం, సరస్సులు, రిజర్వాయర్లు మనల్ని బ్లూ ఎకానమీలో దేశంలోనే ముందు నిలిపాయని గుర్తుచేశారు.మిగతా 2లో...

# ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు రద్దు

**ఉపాధ్యాయులకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి నారా లోకేశ్**

**అభ్యసన ఫలితాల మెరుగుపైనే దృష్టి పెట్టాలని మంత్రి లోకేష్ సూచన**

**ఏపీటీఎఫ్ నేతలతో సమావేశమై సమస్యలు విన్న మంత్రి**

**పాత పెన్షన్, తెలుగు మీడియం కొనసాగింపుపై సంఘం వినతి**

**అన్ని డిమాండ్లను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ హామీ**



2లో.

# తేజస్ క్రాష్..

**దుబాయ్ ఎయిర్ షోలో కుప్పకూలిన యుద్ధ విమానం**

**ప్రదర్శన ఇస్తుండగా జరిగిన ప్రమాదంలో పైలట్ మృతి**

**ఘటనను అధికారికంగా ధ్రువీకరించిన భారత వాయుసేన**



2లో.

# అమల్లోకి నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు



**కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏడాదికే గ్రాట్యుటీ పొందే అవకాశం**

**ఐటీ ఉద్యోగులకు ప్రతినెలా 7వ తేదీలోపు జీతాలు తప్పనిసరి**

**గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు తొలిసారిగా సామాజిక భద్రత కల్పన**

**ప్రతి ఉద్యోగికి అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వడం ఇకపై తప్పనిసరి**

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**

దేశంలోని కోట్లాది మంది ఉద్యోగుల సంక్షేమం, భద్రతను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న 29 పాత కార్మిక చట్టాలను ఏకీకృతం చేస్తూ రూపొందించిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను శుక్రవారం నుంచి అమలులోకి తీసుకొచ్చింది. వేజెస్ కోడ్, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్, మిగతా 2లో...

# మద్యం కేసు నిందితులకు మరోసారి చుక్కెదురు

**డిసెంబర్ 5 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు**

**నిందితులను కోర్టు నుంచి జైళ్లకు తరలించిన అధికారులు**



అమరావతి**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసుకు సంబంధించి నిందితుల రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియడంతో, అధికారులు వారిని కోర్టులో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయస్థానం, డిఫాల్ట్ బెయిల్ పొందిన వారిని మినహాయించి మిగతా నిందితులందరికీ డిసెంబర్ 5 వరకు జ్యుడీషియల్ రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.మిగతా 2లో...

# నన్ను అరెస్ట్ చేసే ధైర్యం లేదు

**ఈ-కార్ రేసు కేసులో లై డిటెక్టర్ టెస్టుకు తాను సిద్ధమన్న కేటీఆర్**

**కడియంను కాపాడేందుకే దానం నాగేందర్ తో రాజీనామా చేయించే ప్రయత్నం అని ఆరోపణ**

**అనర్హత వేటు తప్పించుకునేందుకే ప్రభుత్వం ఎత్తుగడ**

**ముందు జీహెచ్ఎంసీ ఎన్నికలు, తర్వాతే ఉపఎన్నికలు అని జోస్యం**



2లో.

# కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి

**౨: సీఎం చంద్రబాబుకు జగన్ లేఖ**

**ట్రైబ్యునల్ ముందు ప్రభుత్వ వాదనలు బలహీనంగా ఉన్నాయని విమర్శ**

**తెలంగాణ డిమాండ్లు, ఆల్మట్టి ఎత్తు పెంపుపై తీవ్ర ఆందోళన**

**ఒక్క టీఎంసీ నీరు తగ్గినా టీడీపీ ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరిక**

అమరావతి**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**

కృష్ణా నదీ జలాల వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్- (కేడబ్ల్యూడీటీ-) ముందు త్వరలో జరగనున్న విచారణలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిలో 763 టీఎంసీల నీటిని తమమిగతా 2లో...



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



2లో.

**సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికిన టీటీడీ**

**వేదపండితుల ఆశీర్వచనం స్వీకరించిన రాష్ట్రపతి**

# ఇండియా కూటమిలో తీవ్ర సంక్షోభం..

## కాంగ్రెస్‌పై మిత్రపక్షాల ఫైర్

**%బీహార్ ఎన్నికల ఫలితాలతో ఇండియా కూటమిలో తీవ్ర సంక్షోభం**

**కాంగ్రెస్ నాయకత్వం, వ్యూహాలపై మిత్రపక్షాల బహిరంగ విమర్శలు**

**కూటమి పనితీరుపై జేఎంఎం, శివసేన, ఎస్పీల తీవ్ర అసంతృప్తి**

**కాంగ్రెస్ తన వైఖరి మార్చుకోవాలని భాగస్వామ్య పక్షాల డిమాండ్**

**కూటమి భవిష్యత్తుపై నెలకొన్న తీవ్ర అనిశ్చితి**



2లో.

# మెక్సికో సుందరికి మిస్ యూనివర్స్ కిరీటం

**విజేతగా నిలిచిన ఫాతిమా బోష్**

**థాయ్‌లాండ్‌లో ఘనంగా జరిగిన 74వ విశ్వసుందరి పోటీలు**

**గతేడాది విజేత విక్టోరియా చేతుల మీదుగా కిరీటాన్ని అందుకున్న ఫాతిమా బోష్**

**రిహార్సల్స్ సమయంలో వాకౌట్‌తో వార్తల్లో నిలిచిన వైనం**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## మద్యం కేసు నిందితులకు మరోసారి చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)
అంతకుముందు, ఈ కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, అనిల్ చోక్రా, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్యను విజయవాడ జిల్లా జైలు నుంచి ఏసీబీ కోర్టుకు తరలించారు. మరో ఇద్దరు నిందితులు నవీన్ కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్‌ను గుంటూరు జైలు నుంచి తీసుకొచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.నిందితుల రిమాండ్ ముగియడంతో తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ నెలకొనగా, న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించడంతో వారు తిరిగి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కేసు విచారణ కీలక దశలో ఉన్నందున రిమాండ్ పొడిగించాలని దర్యాప్తు సంస్థలు కోరినట్లు తెలుస్తోంది.

## నన్ను అరెస్ట్ చేసే ధైర్యం లేదు

### ఈ-కార్ రేసు కేసులో లై డిటెక్టర్ టెస్టుకు తాను సిద్ధమన్న కేటీఆర్

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
సీఎం రేవంత్ రెడ్డికి తనను అరెస్ట్ చేసే ధైర్యం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వంపై, కాంగ్రెస్ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ-కార్ రేసు కేసులో ఏమీ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. నేను ఏ తప్పూ చేయలేదు. అందుకే లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధంగా ఉన్నా" అని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరిని కాపాడేందుకే దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకవేళ స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తే ప్రభుత్వం పరువు పోతుందని, ఆ ముప్పు నుంచి తప్పించుకోవడానికే కాంగ్రెస్ ఈ రాజీనామా డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ముందుగా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఉపఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు.
రాష్ట్రంలో ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయని, ఆ తర్వాతే ఉపఎన్నికలు జరుగుతాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని ఆయన విమర్శించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం పద్మావతి అతిథి గృహం నుంచి బయలుదేరిన ఆమె, తిరుమల సంప్రదాయం ప్రకారం తొలుత శ్రీ భూ వరాహస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మహాద్వారం వద్దకు చేరుకున్న రాష్ట్రపతికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించుకున్న అనంతరం రాష్ట్రపతి గర్భాలయంలోకి ప్రవేశించి శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆమె వెంట రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఛైర్మన్, ఈవో కలిసి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, 2026 టీటీడీ క్యాలెండర్, డైరీలను అందజేశారు.గురువారమే తిరుపతికి చేరుకున్న రాష్ట్రపతి, మొదట తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆమెకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు.తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ 2025ను ఆమె ప్రారంభించనున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్న శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలలో ఆమె పాల్గొంటారు.

## మూడేళ్లలో17 లక్షలఇళ్ళు

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర జీఎస్డీపీలోనూ మత్స్య రంగానిదే అగ్ర వాటా అని పేర్కొన్నారు దీనికి మరింత మద్దతిచ్చేలా మత్స్యకారులకు, ఆక్వారైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వెల్లడించారు. వేట నిషేధ సమయంలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు ఆర్థిక సాయంగా ఇచ్చినట్లు తెలిపారు. గంగపుత్రులు కోరుకున్నట్టుగా 217 జీవో రద్దు చేసి సొసైటీలకే హక్కు కల్పించినట్లు వివరించారు. ఆక్వా రంగాన్ని ఆంధప్రదేశ్‌కు ఆశాకిరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. మరోవైపు టిడ్కో, గృహనిర్మాణ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. ప్రతి 3 నెలలకోసారి సామూహిక గృహప్రవేశాలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల మంది లబ్దిదారులకు ఇళ్ల తాళాలు అప్పగించాలన్నారు. లబ్దిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తేల్చిచెప్పారు. గత ప్రభుత్వ కక్షసాధింపుతో నిలిపివేసిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ బిల్లులు వచ్చేలా కేంద్రంతో సంప్రదించాలని సీఎం సూచించారు.

## ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు రద్దు

అమరావతి**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇకపై బోధనపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని, వారికి ఎలాంటి బోధనేతర పనులు అప్పగించబోమని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ నేతృత్వంలోని ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో వచ్చే నెలలో నిర్వహించే 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం)' మినహా ఉపాధ్యాయులకు ఇతర పనులేవీ ఉండవని హామీ ఇచ్చారు. డీఈఓ, ఎంఈఓలు కూడా కేవలం అభ్యసన ఫలితాలపైనే దృష్టి కేంద్రీకరించాలని, వారికి సర్వీస్ రూల్స్ వంటి బాధ్యతలు అప్పగించబోమని తేల్చిచెప్పారు. కడపలో విజయవంతమైన 'మోడల్ స్మార్ట్ కిచెన్ల'ను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత 17 నెలల్లో ఉపాధ్యాయ సంఘాలు తన దృష్టికి తెచ్చిన 423 సమస్యల్లో ఇప్పటికే 200 పరిష్కరించామని, మరికొన్ని పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

## అమల్లోకి నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు

ఆక్యుపేషనల్ సేఫ్టీ కోడ్ అనే ఈ నాలుగు సంస్కరణలు వ్యవస్థీకృత, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు సమగ్రమైన రక్షణ కవచాన్ని అందించనున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు, సామాజిక భద్రత, మహిళల సాధికారత వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.
సంక్లిష్టంగా, బహుళ నిబంధనలతో ఉన్న 29 వేర్వేరు చట్టాల స్థానంలో కేవలం 4 కోడ్‌లను తీసుకురావడం ద్వారా ప్రభుత్వం కార్మిక చట్టాల వ్యవస్థను సరళీకృతం చేసింది. దీనివల్ల ఉద్యోగులకు తమ హక్కులపై స్పష్టత లభించడంతో పాటు, యాజమాన్యాలకు కూడా నిబంధనల పాటింపు (కాంప్లయన్స్) సులభతరం అవుతుంది. ముఖ్యంగా, ఇప్పటివరకు చట్టపరమైన గుర్తింపు లేని గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లను (ఓలా, ఉబర్, స్విగ్గీ వంటి యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేసేవారు) తొలిసారిగా చట్ట పరిధిలోకి తీసుకురావడం ఈ సంస్కరణల్లో కీలకమైన మైలురాయి.

# మెక్సికో సుందరికి మిస్ యూనివర్స్ కిరీటం



### విజేతగా నిలిచిన ఫాతిమా బోష్

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
మిస్ యూనివర్స్ 2025 పోటీల్లో మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ విశ్వసుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. థాయ్‌లాండ్‌లో అట్టహాసంగా జరిగిన 74వ మిస్ యూనివర్స్ ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచారు. గతేడాది విశ్వసుందరి, డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా క్జార్ థెల్విగ్.. ఫాతిమాకు కిరీటాన్ని అలంకరించారు. పోటీల ఆరంభం నుంచే ఫేవరెట్‌గా ఉన్న ఫాతిమా తన అందం, ప్రతిభతో న్యాయనిర్ణేతలను మెప్పించారు.25 ఏళ్ల ఫాతిమా బోష్‌కు స్వదేశంలో, అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. ఈ ఏడాది సెప్టెంబరులో ఆమె మిస్ యూనివర్స్ మెక్సికో 2025గా ఎంపికై, విశ్వవేదికపై తన దేశానికి ప్రాతినిధ్యం వహించారు. అయితే, ఈ పోటీలకు ముందు జరిగిన ఒక సంఘటన ఆమెను వార్తల్లో నిలిపింది.
రిహార్సల్స్ సమయంలో థాయ్‌లాండ్‌కు చెందిన ఓ పేజెంట్ డైరెక్టర్ తనపై కేకలు వేశారనే ఆరోపణలతో ఫాతిమా ఈవెనింగ్ గౌన్, హీల్స్‌తోనే వేదిక నుంచి వాకౌట్ చేశారు. ఈ ఘటన ఆన్‌లైన్‌లో పెద్ద చర్చకు దారితీసింది. అయినప్పటికీ ఆమె వెంటనే సంయమనం పాటించి తిరిగి రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. తన వృత్తి నిబద్ధతను చాటుకుని, చివరికి విశ్వసుందరి కిరీటాన్ని గెలుచుకుని అందరి మన్ననలు పొందారు.

# ఇండియా కూటమిలో తీవ్ర సంక్షోభం..

### కాంగ్రెస్‌పై మిత్రపక్షాల ఫైర్

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
బీహార్ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం 'ఇండియా' కూటమిలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఓటమి తర్వాత కాంగ్రెస్ నాయకత్వం, కూటమి అనుసరించిన వ్యూహాలపై భాగస్వామ్య పక్షాలు బాహాటంగానే ప్రశ్నలు సంధిస్తున్నాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూటమి నుంచి వైదొలిగే అంశాన్ని కూడా పరిశీలిస్తుండటంతో కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.బీహార్ ఎన్నికలకు ముందే సీట్ల పంపకాల్లో తమను పక్కన పెట్టారని ఝార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఆరోపిస్తూ కూటమి నుంచి బయటకు వచ్చింది. తమను కేవలం జూనియర్ భాగస్వాములుగా చూస్తున్నారని, సమాన గౌరవం ఇవ్వడం లేదని జేఎంఎం నేతలు విమర్శిస్తున్నారు.
మరోవైపు, బీహార్ ఫలితాలు కూటమికి ఒక మేల్కొలుపు కావాలని శివసేన (యూబీటీ) వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ పార్టీ కొన్ని రాష్ట్రాల్లో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే నష్టం జరిగిందని, మిత్రపక్షాలతో సరైన సమన్వయం లోపించిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. కూటమిలో తీవ్రమైన దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు.
ఇక, బీహార్‌లో ఒంటరిగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నిర్ణయమే సరైందని తాజా పరిణామాలతో స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పార్టీ సంస్థాగత విధానాలను ప్రక్షాళన చేయాలని, పారదర్శకమైన నిర్ణయాలు తీసుకోవాలని మిత్రపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.రాజకీయ విశ్లేషకుల ప్రకారం, ఇది ఇండియా కూటమికి ఒక నిర్ణయాత్మక ఘట్టం. నాయకత్వ సంక్షోభంలో ఉన్న కూటమిలో కొనసాగాలా? లేక సొంత మార్గం చూసుకోవాలా? అనే దానిపై ప్రాంతీయ పార్టీలు ఆలోచిస్తున్నాయి. మొత్తం మీద, బీహార్ ఓటమి ఇండియా కూటమిలో ఒక పెద్ద గుర్తింపు సంక్షోభాన్ని సృష్టించింది.

## కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని జగన్ ప్రస్తావించారు. ట్రైబ్యునల్ ఈ డిమాండ్‌కు అంగీకరిస్తే ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన తుది వాదనలను బలంగా వినిపించి, ఏపీకి జరగబోయే నష్టాన్ని నివారించాలని సూచించారు.
ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడటంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని జగన్ ఆరోపించారు. "ప్రభుత్వం ట్రైబ్యునల్ ముందు బలహీనమైన వాదనలు వినిపిస్తోంది. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉంది" అని లేఖలో పేర్కొన్నారు.ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.16 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచేందుకు అవసరమైన భూసేకరణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతులు ఇవ్వడాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వ వైఖరి సరిగా లేకపోవడం వల్లే పొరుగు రాష్ట్రాలు ఏపీకి నష్టం కలిగించే చర్యలు తీసుకుంటున్నాయని విమర్శించారు.1996లో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచే పనులు మొదలయ్యాయని, అప్పుడు రైతులు, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేసినా ఆయన పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ అనుమతి ఇచ్చిందని, 2014లో కూడా టీడీపీ ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు వదులుకుందని ఆరోపించారు.
"ఈ కీలక తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించి, కృష్ణా జలాలపై మన హక్కులను కాపాడాలి. బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీల నికర జలాల్లో ఒక్క టీఎంసీ తగ్గినా, అందుకు టీడీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని జగన్ తన లేఖలో స్పష్టం చేశారు.



## తేజస్ క్రాష్..

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
దుబాయ్ ఎయిర్ షోలో ప్రదర్శన ఇస్తుండగా భారత వాయుసేనకు చెందిన తేజస్ యుద్ధ విమానం ప్రమాదానికి గురైందని, ఈ ఘటనలో పైలట్ ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. పైలట్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, పైలట్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపింది. ప్రమాదానికి గల కారణాలను నిగ్గు తేల్చేందుకు కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించినట్లు వెల్లడించింది.
ప్రపంచంలోని అతిపెద్ద ఏవియేషన్ ప్రదర్శనలలో ఒకటైన దుబాయ్ ఎయిర్ షోలో ఏరియల్ డిస్‌ప్లే ఇస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తేజస్ యుద్ధ విమానానికి సంబంధించి ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం. 2001లో తొలిసారి గాల్లోకి ఎగిరినప్పటి నుంచి సుమారు 23 ఏళ్ల చరిత్రలో మొదటి ప్రమాదం 2024 మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్ సమీపంలో జరిగింది. అయితే ఆ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డారు.తేజస్ 4.5వ తరం, అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేయగల మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్. ఇది వైమానిక దాడులు, క్లోజ్ కంబాట్, భూమిపై దాడి వంటి పలు రకాల పాత్రలను సులభంగా నిర్వహించగలదు. ఈ దుర్ఘటనతో దుబాయ్ ఎయిర్ షోలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి రాక

**పటిష్టమైన భద్రత ఏర్పాట్లు**
**పర్యటన ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలి**
**అందరి సమన్వయంతో విధులు నిర్వహించాలి**
**పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేసిన**
**అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి**
**జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపీఎస్**





**శ్రీ సత్యసాయినవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
శ్రీ సత్య సాయి బాబా శతజయంతోత్సవాల నేపథ్యంలో నేడు పుట్టపర్తిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు, పర్యటించనున్నారు. వీరి భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం విచ్చేసిన, ట్రైనీ ఐపీఎస్ లతోపాటు, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పిలు, సిఐ, ఎస్ఐలకు, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోసి ఐపీఎస్ , జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించి భద్రతపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ ఆవరణంలో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసు అధికారులకు బ్రీఫింగ్ చేశారు.

**రోడ్డు మార్గం గుండా వెళ్లే పాయింట్లలో జాగ్రత్త**
అనంతపురం రేంజ్ డిఐజి ,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ నేడు ఉదయం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో పాటు , సీఎం, సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు హాజరవుతారన్నారు. అదేవిధంగా ఆదివారం ఉదయం హిల్ వ్యూ స్టేడియంలో జరిగే కార్యక్రమాలలో కూడా ఉపరాష్ట్రపతి ముఖ్యమంత్రి పాల్గొంటారని భద్రత ఏర్పాట్లపై ఆయా సెక్టార్ ఇన్చార్జిలకు బ్రీఫింగ్ చేశారు. సత్యసాయి విమానాశ్రయంలో బందోబస్తు ఏర్పాట్లు, కాన్వాయ్ వెళ్లే రోడ్డు మార్గం, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. విమానాశ్రయం నుండి వెళ్లే రోడ్డు మార్గం కాన్వాయి, పుట్టపర్తిలోని సాయి కుల్వంత్ హాల్ వెళ్లే సమయంలో బందోబస్తు నిమిత్తం ఏర్పాటు చేసిన పాయింట్లలో జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు.

**ప్రతి ఒక్కరినీ డి ఎఫ్ ఎం డి ద్వారా తనిఖీలు చేసి లోపలికి పంపాలి**
ఎయిర్ పోర్టు దగ్గర, కాన్వాయ్, పబ్లిక్ గ్యాలరీలు, పార్కింగ్ ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రతి ఒక్కరినీ డి ఎఫ్ ఎం డి ద్వారా తనిఖీలు చేసి లోపలికి పంపాలని సూచించారు. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు గట్టి చర్యలు చేపట్టామన్నారు. అందరూ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఆదివారం సాయంత్రం వరకు కేటాయించిన విధులలో ఉంటూ వేడుకలు ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని వారు సూచించారు.ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ లు, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు,సిఐలు, ఆర్ ఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 22 నవంబర్ 2025

# నందమూరినగర్ జడ్పీ హైస్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

## విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.

**జడ్పీహెచ్ఎస్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రం.**
**గత మూడు రోజుల నుంచి విద్యార్థులకు గుడ్లు ఇవ్వలేదు.**
**మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు.**
**హెడ్మాస్టర్ కు, ఎంఈఓ కు సోకాస్ నోటీస్ జారీ.**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 21:**
నంద్యాల పట్టణంలోని నందమూరినగర్ లో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాల పరిసర ప్రాంతాలను కలియతిరిగి అక్కడి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో ప్రధానోపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు, విద్యార్థినులకు ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నప్పటికీ విద్యార్థుల మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని దీంతో విద్యార్థులు బహిర్భూమికి బయటికి వెళు_న్నామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు గత మూడు రోజుల నుంచి గుడ్లు ఇవ్వలేదు. జిల్లా పరిషత్ హైస్కూల్ తరగతి గదులు, హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ స్వయంగా కలియతిరిగి అక్కడి సమస్యలు గుర్తించారు. పాఠశాల పరిసర ప్రాంతాలు చాలా అపరిశుభ్రంగా ఉండడంతో ప్రధానోపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ వెంటనే హెడ్మాస్టర్ కు, ఎంఈఓ కు సో కాజ్ నోటీస్ జారీ చేయాలని డీఈఓకు సూచించారు.



# భారతీయ ఇతిహాసాలన్నీ సామాజిక స్పృహను పెంచేవే.

## డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తితిదే.

## గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.



**ఆంధ్ర ప్రగతి వెలుగోడు నవంబర్ 21:**
విద్యఅంటే కేవలం చదువే కాదని, ఏది తెలుసుకుంటే ఇహపరాలకు సుఖ శాంతులను కలిగిస్తుందో అదే నిజమైన విద్యఅని, భారతీయ ఇతిహాసాలన్నీ ఐహిక సుఖంతోపాటు సామాజిక స్పృహను పెంచేవేనని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కళ్ళు నిర్ల శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వెలుగోడు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు శ్రీనివాస రామానుజ దాసు, నిత్యతృప్తదాస్ చేసిన భాగవత పురాణం భక్తులను ఎంతగానో అలరించినది. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు లాలం సుధాకర్, ఉపిద్యక్షులు ఎల్. జనార్ధన్, గౌరవాధ్యక్షులు జూటూరు నాగపుల్లయ్య, సభ్యులు సంజీవరాయుడు, శ్రీనివాసులు, ధర్మప్రచారమండలి సభ్యులు ఉదారు రామలింగేశ్వర రెడ్డి, అర్చకులు తిరుపాలయ్య, మహిళామండలి సభ్యులు లాలం మాధవి, తల్లం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో పొట్టేల్లు మృతి.

## గాయపడ్డ గొర్రెలకు వైద్య సేవలు డాక్టర్ దస్తగిరి.

**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల నవంబర్ 21:**
మండల కేంద్రంలోని డేగల పేటలో రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేసినట్లు పశు వైద్యాధికారి దస్తగిరి తెలిపారు. కుక్కల దాడిలో ఆరు పొట్టేలు మృతి చెందగా మరో ఆరు అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్నారు గాయపడ్డ గొర్రెలకు వైద్య సేవలు అందించి యాంటీబయోటిక్ పెయిన్ కిల్లర్స్ మరియు రేబిస్ వ్యాక్సిన్ సైతం ఇచ్చామని తెలిపారు గొర్రెల యజమాని అన్వర్ భాష తమ జీవాలకు ఇన్సూరెన్స్ చేసుకోకపోవడం వల్ల బీమా సౌకర్యం వర్తించడం లేదని ఈ సందర్భంగా పశు వైద్యాధికారి దస్తగిరి స్పష్టం చేశారు.





# జిల్లాలో మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు.

## జిల్లాలో మత్స్యసంపద పెంచి మత్స్యకారుల జీవితాలలో వెలుగులు.

## మత్స్యకారుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 21:**
జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేకతలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.
శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు జిల్లా మత్స్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... జిల్లాలో ఉన్న మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.
నంద్యాల వ్యవసాయ అనుబంధ శాఖలపైన ఆధారపడిన జిల్లా మన జిల్లాలో ఎక్కువగా హార్టికల్చర్, లైవ్ స్టాకు, అగ్రికల్చర్ తర్వాత ఆక్వారంగం ద్వారా జిల్లాకు జిడిపి ఎక్కువగా వస్తుందన్నారు. జిల్లాలో 65వేల మెట్రిక్ టన్నులు చాపల ఉత్పత్తి ఉందన్నారు. ఈ ఏడాది 80 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలన్న ఆలోచనతో జిల్లా యంత్రాంగం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలో 330 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయని కానీ 110 ట్యాంకులలోనే చేపల పెంపకం జరుగుతోందని చేపల పెంపకం రిజర్వాయర్లు చెరువుల ద్వారా పెంచితే మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి పెరిగి జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా చెరువులలో మరింత చేపల పెంపకం చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఫిష్ నర్సరీస్ ని అభివృద్ధి చేయడం జరిగిందని వచ్చే సంవత్సరానికి మరింత అభివృద్ధి చేసి జిల్లాకు కావలసిన చేపపిల్ల ఉత్పత్తిని మన జిల్లాలోనే జరిగి మత్స్యకారులందరికీ అందించడం జరుగుతుందన్నారు.
మత్స్యకారులు సొసైటీలో సభ్యత్వం కావాలంటే ఐదు స్కిల్స్ ఉండాలని ఈ ఐదు స్కిల్స్ కు సంబంధించిన శిక్షణ కూడా ఫిసిరిస్ డిపార్ట్మెంట్ ద్వారా అందించి ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపడం జరుగుతుందన్నారు. ఈ విధంగా జిల్లా యంత్రాంగం తరఫునుంచి అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.
ప్రతి కుటుంబంలో కనీసం ఒకరైన విద్యావంతులు ఉండాలని ప్రతి కుటుంబం ఉన్నత జీవన ప్రమాణాలతో గడపాలనుకుంటే మన కులవృత్తినే మన సంప్రదాయ వృత్తి అనుకొని ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. మన కులవృత్తులను పాటిస్తూనే మన పిల్లలను చదువు వైపు ప్రేరేపించాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరైనా చదువుకున్న వ్యక్తి ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెంది ఆ కుటుంబం యొక్క రూపురేఖలు మారుతాయన్నారు. మత్స్యకారుల కోరిక మేరకు జిల్లాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోస్టల్ వారికి ఇచ్చిన బెనిఫిట్స్ అన్ని కూడా మన జిల్లాలో ఇచ్చేందుకు ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు పూర్తయిన మత్స్యకారులకు పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వ నియమ నిబంధనలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. చేపల్లో ఉన్నటువంటి ఆరోగ్యకరమైన ప్రోటీన్లు ఎక్కడ దొరకవన్నారు. మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ చేపలు తినాలన్నారు.

# నంద్యాల విజయ డైరీ పై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపిన మంత్రి నారా లోకేష్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 21:**
నంద్యాల విజయ డైరీ లో చైర్మన్ మరియు డైరెక్టర్లు చేస్తున్న అవినీతి అక్రమాలను, శుక్రవారం నాడు విజయవాడలో మంత్రి నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి విజయ డైరీ అక్రమాలను తెలియజేసినభూమా జగత్ విఖ్యాత్ రెడ్డి. మిల్క్ పాల ప్యాకెట్ పై ప్రజలపై భారం మోపి సంవత్సరానికి 7 కోట్లు పాల ప్యాకెట్లపై సంపాదిస్తున్నారని, గత కొద్దిరోజుల కిందట విజయ డైరీ ని స్థాపించిన ఎన్టీ రామారావు శిలాఫలకాన్ని కాల్వలో పడేయడంతో మేము అక్కడికి వెళ్లి అధికారులతో కొట్లాడి మళ్లీ శిలాఫలకాన్ని అక్కడ పెట్టించడం జరిగిందని తెలియజేసారు. విజయ డైరీ కి సంబంధించి 35 ఎకరాల భూమి ఉందని ఆ భూమిని వైసిపి చైర్మన్ గత వైసిపి హయాంలో వారిపై ఆన్లైన్ చేపించుకోవడం జరిగిందని దాదాపు 350 కోట్ల రూపాయలు విలువచేసే భూమి, ఇప్పుడు ఈ భూమిని ప్రభుత్వానికి చేరేలాగా చర్యలు తీసుకోవాలని, గతంలో ఈ విషయంపై సీఎం దృష్టికి కూడా తీసుకొని వెళ్లడం జరిగిందని ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలిపారు.



# రాష్ట్రస్థాయి పోటీలో కాంస్యపతకం సాధించిన చిన్నారిని సన్మానించి టిడిపి నేత వాహిద్ హుస్సేన్.

**ఆంధ్ర ప్రగతి కర్నూల్ నవంబర్ 21:**
ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం సాధించిన చిన్నారి సైదా ను టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరి వాహిద్ హుసేన్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి వాహిద్ హుసేన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఎంతో అంకితభావంతో, కష్టపడి రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యపతకం సాధించడం సయిదా పట్టుదలకి నిదర్శనం అని అన్నారు. సయిదా భవిష్యత్తులో ఇంకా ఎన్నో రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ పతకాలు సాధించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఇలాంటి విజయాలు ప్రతి చిన్నారికి ప్రేరణగా మారాలని, క్రీడల ద్వారా పిల్లలు క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని వహీద్ హుస్సేన్ కోరారు. చిన్నారి సైదాను తీర్చిదిద్దిన కోచ్, అ చిన్నారి తల్లిదండ్రులను వాహిద్ హుసేన్ అభినందించారు.





# కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించిన వైద్యాధికారి ముఖేష్.

## అందుబాటులో లేమని దుర్భసలాడడం తగదు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల నవంబర్ 21:**
మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ ముకేశ్ కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. నవంబర్ 17 నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి పరీక్షిస్తున్నామని వైద్యాధికారి ముకేశ్ తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమయిన జిడ్డు చర్మం, బత్తాయి తొక్క లాంటి గడ్డలు, కనుబొమ్మలు రాలిపోవడం, చెవి తమ్మెళ్లు మందంగా రావడం , కళ్ళు మూసుకుపోవడం వంటి లక్షణాలు ఉంటే తప్పకుండా చూపించుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధికి ఉచిత ఎం డి టి మందులు అందిస్తున్నామని కుష్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధులకు సమయానికి హాజరుకాలేదని, అందుబాటులో లేమని దుర్భసలాడడం తగదని ప్రచారం చేయడం తగదని డాక్టర్ ముకేశ్ తెలిపారు. విధులకు హాజరైన, హాజరు కానట్టు కొందరు వ్యక్తులు మనోభావాలను దెబ్బతీసే విధంగా చేస్తున్నారని విధులకు సమయానికి హాజరు కాకపోతే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం.!

### అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంతో రైతుల కుటుంబాల్లో సంతోషం.

### రైతు సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం. -నంద్యాల జనసేన నాయకులు మారాసు గురుబాబు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబరు 21:**
అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్ పథకం నిధుల విడుదల సందర్భంగా ఒక ప్రకటన విడుదల ద్వారా నంద్యాల జనసేన నాయకులు మారాసు గురు బాబు మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే సూపర్ సిక్స్ సహా అన్ని హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో హంగామా చేసి ఏడాదికి 13,500 ఇస్తామని చెప్పి 7,500 మాత్రమే ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన విధంగానే ఒక్కొక్క రైతుకు ఏడాదికి 20 వేలు ఇస్తున్నామన్నారు. మొదటి విడతగా ఈ ఏడాది ఆగస్టులో రైతుల బ్యాంకు ఖాతాల్లో



రూ. 7,000 జమ చేయగా, ఇప్పుడు రెండో విడతలో బుధవారం మరో 7,000 జమ చేయటం జరిగిందన్నారు అర్హులైన 46,85,838 రైతుల బ్యాంకు ఖాతాల్లో మొదటి విడతలో ఆగస్టులో 3,174 కోట్లు జమ చేయగా, రెండో విడతలో మరో 3,135 కోట్లు ఇప్పుడు జమ చేయడం జరిగిందని, రెండు విడతల్లో కలిపి ఇప్పటివరకూ మొత్తం 6,309.44 కోట్లు రూపాయలు పెట్టుబడి సాయంగా రైతులకు అందించడం జరిగింది. ఇది దేశంలోనే రికార్డు అని, మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయి సహాయం రైతులకు అందించిన ప్రభుత్వం లేదన్నారు జనసేన నాయకులు మారాసు గురుబాబు అర్హత ఉన్న ఏ ఒక్క రైతు నష్టపోకూడదు అనే ఉద్దేశంతో ఈ కేవైసీ, ఎన్పీసీఐ యాక్టివేషన్ లేని రైతుల సమస్యలు కూడా పరిష్కరించి, వారిని తిరిగి లబ్ధిదారుల జాబితాలో చేర్చామని, అలాగే చనిపోయిన రైతుల వారసులకు మ్యుటేషన్ చేసి పథకం వర్తించేలా చేస్తున్నామని, ఇది రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అదే విధంగా ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారాలను నమ్మకుండా రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వానికి మద్దతిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు మంత్రి నారా లోకేష్ లకు నంద్యాల జనసేన నాయకులు మారాసు గురు బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అహోబిలం భద్రత బలోపేతం సంయుక్త సమీక్షలో కీలక నిర్ణయాలు.

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ నవంబర్ 21:**
అహోబిలంలో నేడు ఆళ్ళగడ్డ డీఎస్పీ శ్రీ కె. ప్రమోద్ వారి పర్యవేక్షణలో పోలీసు శాఖ, అటవీ శాఖ, అహోబిలం దేవాలయం నిర్వహణ కలిసి ఒక సమగ్ర భద్రతా సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, దేవాలయ భద్రతను మరింత బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.
సమీక్షలో భాగంగా, అన్ని శాఖలు కలిసి ప్రస్తుతం అమల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అహోబిలం పవిత్రక్షేత్రానికి వచ్చే వేలాది మంది భక్తులకు పూర్తి భద్రత కల్పించేందుకు పలు చర్యలను చర్చించారు.

**తీసుకున్న ముఖ్య నిర్ణయాలు:**

**సీసీటీవీ పర్యవేక్షణ:**
అహోబిలం పరిసరాలు మరియు దేవాలయ ప్రవేశ/నిష్క్రమణ ద్వారాలన్నీ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానమైన



సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడతాయి.

**24/7 నిఘా:**
అహోబిలం ప్రాంతంలో అనుమానాస్పద కదలికలను గమనించేందుకు కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు పోలీసు సిబ్బందిని విధుల్లో పెట్టాలని నిర్ణయించారు.

**క్లాక్ రూమ్ ఏర్పాటు:**
దేవాలయ దర్శనం ముందు భక్తులు తమ లగేజ్, మొబైల్ ఫోన్లు ఉంచుకునేందుకు ప్రత్యేక క్లాక్ రూమ్ ఏర్పాటు చేయబడుతుంది.

అత్యవసర పరిస్థితుల సిద్ధత:
అత్యవసర ఎవాక్యుయేషన్ ప్లాన్‌లను సమీక్షించారు. దేవాలయం లోపలి ముఖ్య ప్రదేశాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఫస్ట్-ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**స్ట్రాంగ్ రూమ్ %డ% దేవాలయ ఆస్తుల భద్రత:**
దేవాలయ స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న విలువైన ఆభరణాలు, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆభరణాలు అత్యాధునిక అలారం వ్యవస్థతో రక్షించబడతాయి. స్ట్రాంగ్ రూమ్‌ను తెరవడానికి ఏదైనా ప్రయత్నం జరిగిన వెంటనే సైరన్ మోగి, దేవాలయ మేనేజర్ మరియు పీఠాధిపతికి వెంటనే అలర్ట్ సందేశాలు పంపబడే విధంగా వ్యవస్థ అమలు చేయబడుతుంది.

**అత్యవసర సంప్రదింపు నంబర్లు:**
అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, జంతు రక్షణ బృందం, దేవాలయ నిర్వహణ ఫోన్ నంబర్లను భక్తులకు కనిపించే ప్రధాన ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తారు. ఈ సమావేశంలో దేవాలయం మేనేజర్ శ్రీ సుందర రాజన్, ఆళ్ళగడ్డ రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ మర్తుజావలి, మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.
అహోబిలం దేవాలయ భద్రతను మరింత బలోపేతం చేస్తూ, భక్తుల రక్షణ మరియు దేవాలయ ఆస్తుల సంరక్షణ కోసం ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది.

## నేరాలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్, యాప్ మోసాలు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన.

**ఆంధ్ర ప్రగతి ప్యాపిలి నవంబర్ 21:**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు ప్యాపిలి పోలీస్ స్టేషన్ పరిదిలో కస్తూరిబా గాంధీ బాలికల విధ్యాలయం మరియు విజయా నికేతన్ స్కూల్ నంనందివర్గం నందు విద్యార్థులతో సబ్ ఇన్స్పెక్టర్లు మధుసూదన్ మరియు వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా పాఠశాల విద్యార్థులతో స్కూల్ ప్రాంగణంలో సమావేశమై డ్రగ్స్, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, బాలికల సంరక్షణ చట్టం (ఫోక్సో చట్టం), సైబర్ క్రైమ్, రహదారి భద్రత నియమాలు,బల్వంతపు బాల్యవివాహాలు మొదలగు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఒక్కసారి అలవాటు పడితే అవి మీ జీవితాన్ని మరియు మీ చుట్టూ ఉన్న వారి జీవితాలను నాశనం చేస్తాయి. మీకు ఎవరికైనా మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి. మాదక ద్రవ్యాలు లేని సమాజ



నిర్మాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే లింక్‌లపై క్లిక్ చేసేటప్పుడు లేదా డౌన్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత సమాచారాన్ని లేదా ఓటీపీలను ఎవరితోనూ పంచుకోకూడదు. మొబైల్ దొంగతనం, సైబర్ క్రైమ్, ఫేక్ లోన్ యాప్స్ మోసాల గురించి వివరించి, అపరిచుతుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్తులు అంగీకరించవద్దు. మీ వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవద్దు. వాటిని ఎలా ఎదుర్కోవాలో ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఎవరైన సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 కి కాల్ చేసి గాని **www.cybercrime.gov.in** లో 24 గంటల లోపల ఫిర్యాదు చేయండి. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే మరియు ఎవరైనా మైనర్ లు వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేసి వారి తల్లిదండ్రుల పై కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనంలో ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, రహదారిపై మీ కళ్ళ ముందు ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే డయల్ 100/112 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ బాధ్యత గల పౌరులుగా రహదారి భద్రత నియమాలను పాటించి మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో బాధ్యతగా చదువుకొని మీ యొక్క తల్లిదండ్రులకు సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. విద్యార్థి దశ నుండి మంచి క్రమశిక్షణ కలిగి, చదువుకున్నటువంటి వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ అవగాహన కార్యక్రమంలో తెలియజేశారు.

# ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం.

### ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.ఎం.డి. ఫిరోజ్. -నిర్వహించిన నంద్యాల టీవీ టెక్నీషియన్స్ సంఘం.

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ. -టెలివిజన్ రూపకర్త బైర్డ్ చిత్రపటానికి పూలమాలతో నివాళి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 21:**
శుక్రవారం ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా నంద్యాల టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య,నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్స్ సంఘం అధ్యక్షులు జయపాల్, కార్యదర్శి వెంకట శివ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి.ఫిరోజ్, నంద్యా జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అతిథులుగా పాల్గొని ముందుగా టెలివిజన్ రూపకర్త బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి



నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రి లో ఉన్న రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎన్.ఎం.డి.ఫిరోజ్ రోగులను పరామర్శించి అందుతున్న చికిత్సల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎం.డి.ఫిరోజ్ మాట్లాడుతూ టీవీ టెక్నీషియన్స్ కు మెప్మా ఆధ్వర్యంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పించడం జరుగుతున్నదని, అర్హులైన వారికి ఇండ్లు,ఇళ్ల స్థలాలు కేటాయించడానికి సహకరిస్తామన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ టెలివిజన్ సాంకేతికత నిరంతరం మార్పు చెందుతూ ఉంటుందని తదనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని టీవీ టెక్నీషియన్స్ మెరుగుపరుచుకోవాలని, వినియోగదారుడికి నాణ్యమైన,నమ్మకమైన సేవలు అందించడం ద్వారా వృత్తిలో మంచి ఫలితాలు అందుతాయన్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీవీ టెక్నీషియన్స్ రాష్ట్ర సంఘం కోశాధికారి రామకృష్ణ, నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పుల్లయ్య, గౌరవ సలహాదారు గోకారి, ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, సంయుక్త కార్యదర్శి ఎల్లా గౌడ్, కోశాధికారి వీరారెడ్డి, సహకోశాధికారి కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టీవీ టెక్నీషియన్ లకు నైపుణ్య శిక్షణ అందిస్తాం.!

### -స్వయం ఉపాధికి సహకరించి అండగా ఉంటాం. -ఎన్ ఎండిఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:**
నంద్యాల జిల్లా టివి టెక్నీషియన్లకు నైపుణ్య శిక్షణ అందించి ,స్వయం ఉపాధి కి అండగా ఉంటానని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి.ఫిరోజ్ పేర్కొన్నారు.



నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి. ఫిరోజ్ హాజరై టెలివిజన్ రూపకర్త జాన్ లోగి బైర్డ్ చిత్రపటానికి పూలమాల వేసి తన చేతుల మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ టెలివిజన్ కేవలం ఒక ఎలక్ట్రికల్ సాధనం మాత్రమే కాదని, ఒక నిత్యావసర సరుకు లా ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. గతంలో టీవీల ద్వారానే ప్రపంచం గురించి ప్రజలకు తెలిసేదని మన భారత దేశంలో టెలివిజన్ రామాయణ మహాభారతం లాంటి పౌరణిక సీరియల్ క్రికెట్ మ్యాచ్ లు వార్తల ద్వార ప్రజలకు మరింత చేరువ అయ్యిందన్నారు. గృహంలో ఇంటి పనులు చేసుకొని బిజీగా ఉండే మహిళలకు కాసేపు సేదతీరడానికి టీవీ ఎంతో ఉపయోగ పడుతుందని సీరియల్స్ వచ్చాక ఒక్కరోజు టీవీ లేకుండా మహిళలు ఉండలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఈ టెలివిజన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న టీవీ టెక్నీషియన్స్ కు కూటమి ప్రభుత్వం తరుపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారికి ప్రభుత్వ నైపుణ్యభివృద్ధి సంస్థ ద్వార శిక్షణ ఇప్పించి పనిముట్లు అందించి వారి నైపుణ్యాన్ని పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ,టీవీ టెక్నీషియన్ జిల్లా అధ్యక్షులు జయ పాల్, మహబూబ్ భాష, శివ యాదవ్, వీర రెడ్డి, యేళ్ళ గౌడ్, గోకరి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్ముచున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్.

### ముద్దాయిల వద్ద నుండి 2 కేజీల గంజాయి, 3 సెల్ ఫోనులు మరియు ఒక పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం. - పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి పాణ్యం నవంబర్ 21:**
21వ తేదీన పాణ్యం గ్రామము లోని స్టీల్ ప్లాంట్ వద్ద అరెస్ట్ అయిన ముద్దాయిల పేర్లు. 1. ముల్లా వసీం అక్రమ్, వయస్సు 35 సంవత్సరాలు, తండ్రి "పేరు ముల్లా గౌస్ మోహిద్దీన్, ఇంటినంబర్. 2-55, చిన్న మకన్మ్ వీధి, చాగలమర్రి గ్రామము మరియు మండలము. 2. లంకా .అలెగ్జాండర్, వయస్సు 27 సం..లు, %S/o% ప్రతాప్, స్వగ్రామము ఆళ్లగడ్డ టౌన్ ప్రస్తుతము



గడ్డం వీధి, చాగలమర్రి గ్రామము మరియు మండలము. 3. బూరుగుల. మనోహర్, వయస్సు 28 సంవత్సరాలు, తండ్రి పేరు చిన్న మద్దిలేటి, ఇంటి నంబర్ 4-41, కుమ్మరిడిది స్ట్రీట్, ఔక్ గ్రామము మరియు మండలము ప్రస్తుతం ఈద్గా నగర్ బనగానపల్లే పట్టణము. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు గంజాయి నిర్మూలన కొరకు, 21.11.2025 తెధి న పాణ్యం సిఐ వి.కిరణ్ కుమార్ రెడ్డి తనకు రాబడిన సమాచారము తో పాణ్యం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి మరియు పి.ఎస్.ఐ ధనుంజయ, మరియు పాణ్యం స్టేషన్ సిబ్బంధి సహాయము తో పై కనపరచిన ఏ 1, ఏ2 మరియు ఏ 3 లను పాణ్యం గ్రామము లోని స్టీల్ ప్లాంట్ వద్ద అరెస్టు చేస్తి, వారి వద్ద నుండి 2 కేజీల గంజాయి, 3 సెల్ ఫోనులు మరియు ఒక పల్సర్ మోటార్ సైకల్ లను పంచాయతీ దారుల సమక్షములో స్వాదీనము చేసుకొని వారిని నంద్యాల కోర్టు లో హాజరు హాజరు పరచడమైనది.

# ఈనెల 24 నుంచి 'మీకోసం రైతన్న' కార్యక్రమం ప్రారంభం.

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 21:** రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 'మీకోసం రైతన్న' కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా 'మీకోసం రైతన్న' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ సాంకేతికతల వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు, ప్రభుత్వ మద్దతు వంటి ఐదు కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారుల బృందాలు గ్రామాల్లోని రైతులను ప్రత్యక్షంగా సందర్శించి రోజుకు 30 మంది రైతులకు ముఖ్యమంత్రి సందేశలేఖను చదివి వినిపించడం, ఆయా పథకాలపై కరపత్రాలు అందించడం, రైతుల ఫోటోలను అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ యాప్‌లో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 24 నుండి 29 వరకు కొనసాగి, అనంతరం రైతుల సమస్యలను సేకరించి డిసెంబర్ 3న రైతుసేవా కేంద్రాల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొంటారని, వర్క్‌షాప్ ద్వారా లభించిన ఫీడ్బ్యాక్‌ను ప్రభుత్వానికి పంపనున్నామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఈ సీజన్‌కి మొత్తం 7.56 లక్షల ఎకరాల్లో పంటల నమోదు జరిగిందని కలెక్టర్ తెలిపారు. వరి సాధారణ విస్తీర్ణం 65,255 హెక్టార్లు కాగా, ఈ సంవత్సరం 92,313 హెక్టార్లలో సాగు జరగగా, మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 50,515 హెక్టార్లకు బదులు 96,677 హెక్టార్లలో సాగు జరిగిందన్నారు. కంది పంటలో కూడా 36,243 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 47,035 హెక్టార్లలో సాగు జరిగింది. మొత్తం మీద గత సంవత్సరం కంటే 66,472 హెక్టార్ల అదనపు విస్తీర్ణంలో పంటలు సాగు చేయబడినట్లు వెల్లడించారు. దీంతో ఉత్పత్తి పెరిగి వరి 6 లక్షల మెట్రిక్ టన్నులు, మొక్కజొన్న 6 లక్షల మెట్రిక్ టన్నుల మేర లభించడంతో జిల్లా జి వి ఏ కూడా గణనీయంగా పెరిగిందని కలెక్టర్ తెలిపారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలి

## - డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:**
కూటమి ప్రభుత్వం కల్లు తెరవాలని, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, విద్యార్థుల భవిషత్తుతో చెలగాటం ఆడవద్దని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్రె డ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నంద్యాల పట్టణంలోని 17, 18,19, 20 వార్డులలో వున్నా విశ్వనగర్, ఎన్జీఓ కాలనీ, పొన్నాపురం, ఏకలవ్య నగర్ ప్రాంతంలో నేడు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజల వద్ద నుండి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై ఎస్సార్సీపీ రాష్ట్ర ఎగ్జికూటివ్ మెంబర్ దేశం సుధాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిర్ అమీర్, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు, వైసీపీ నాయకులు శ్రీరాములు, మానిపాటి ఆంజనేయులు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృత రాజ్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, నంద్యాల అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, లీగల్ సెల్ స్టేట్ సెక్రటరీ శ్రీనివాసులు,





సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, డీలర్ లు జనార్ధన్, మోహన్ రెడ్డి, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థుల బంగార్లు భవిషత్తును నాశనం చేసేందుకు చేస్తున్న కుట్రలో భాగంగా రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం మాజీ మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. తొలి దశలో 5 మెడికల్ కళాశాలలను ప్రారంభించారని తెలిపారు. నంద్యాల మెడికల్ కళాశాల ప్రథమ సంవత్సరం చదివిన విద్యార్థిక స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం జరిగిందన్నారు. ఇటీవల నంద్యాల మెడికల్ కళాశాల ప్రెషర్స్ డే వేడుకలకు టీడీపీ నేతలు రావడం జరిగిందని, అయితే ఆ పార్టీ హెూంశాఖ మంత్రి వంగల పూడి అనిత మెడికల్ కళాశాలలే లేవని అసత్యపు, అబద్దపు మాటలు మాట్లాడటం ప్రజలు గ్రహించాలన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చే శారు. ప్రజలు తాము చేస్తున్న ప్రజా ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

# అవయవ దానం గొప్పది.

## -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 21:**
అవయవ దానం ప్రాణాలకు ప్రాణం ఇచ్చే మహెూన్నత సేవ అని, అవయవ దానంకు దాతలు ముందుకు రావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్లమెంట్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ స్థాండింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు.




శుక్రవారం న్యూఢిల్లీలో పార్లమెంటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మానవ అవయవాలు, కణజాల మార్పిడిపై చట్టాలు, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల నివారణ, చికిత్స విషయాలపై వైద్య నిపుణులతో కలిసి చర్చించడం జరిగిందన్నారు.భారత దేశంలో అవయవ దానానికి మరిన్ని అవగాహన కార్యక్రమాలు, బలమైన చట్టాల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రయత్నాలు చర్యలు అభినందనీయం అన్నారు.దేశ వ్యాప్తంగా అవయవ దానం %-% ప్రాణాలకు ప్రాణం ఇచ్చే మహెూన్నత సేవ అంటూ ప్రచారం, అవగాహన చేద్దాం అని సమావేశంలో తీర్మానం చేశాం అన్నారు. అవయవ దానం కోసం దాతలు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారికీ ప్రాణదానం చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల టిడ్కో ఇల్లు ను పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21** గత ప్రభుత్వం క్రూరంగా ఆలోచించి టిడ్కో గృహాలను పూర్తి చేస్తే గౌరవనీయులు చంద్రబాబు నాయుడు గారికి మరియు టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఒక చెడు ఆలోచనతో టిడ్కో ఇల్లును పూర్తి చేయలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యలూరు గ్రామంలో ఉన్న టిడ్కో ఇల్లు ను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ లబ్దిదారుల పేరున బాంక్ రుణాలు సేకరించి, ఆ డబ్బులను పక్కదారి పట్టించి, ఆయా లబ్దిదారులకు గ్రుహాలను ఇయ్యక పోగా, వారిపై బ్యాంకు రుణాల భారం వైస్సార్సీపీ ప్రభుత్వం మోపిందన్నారు . ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు ప్రజల తరపున ప్రభుత్వం కడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన 20 నెలల కాలంలోనే లక్ష టిడ్కో గృహాలను అర్హులైన వాళ్లకు అందించేలా ప్రణాళిక రూపొందించి ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, టిడ్కో హౌస్ అధికారులు , మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూనెపల్లె అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి ఫరూక్ కు వినతిపత్రం.

## - నూనెపల్లె అభివృద్ధి కార్యాచరణ కమిటీ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:**
నంద్యాల పట్టణంలోని చారిత్రక నూనెపల్లె ప్రాంతంలో అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని నూనెపల్లె అభివృద్ధి కార్యాచరణ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎం.డి. ఫరూక్ కి శుక్రవారం వినతిపత్రం సమర్పించింది. 1898లోనే నంద్యాలతో పాటు మున్సిపాలిటీగా ఏర్పడి, ఒకప్పుడు పారిశ్రామిక, వ్యాపార కేంద్రంగా కళకళలాడిన నూనెపల్లె, ప్రస్తుతం 50 వేల జనాభాతో, 9 వార్డులు కలిగి ఉందని. నూనెపల్లె ప్రజల దీర్ఘకాలిక కష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈ క్రింది సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి ఫరూక్ ని కోరారు.

**రైల్వే అండర్‌గ్రౌండ్ రహదారి ఏర్పాటు చేయాలి**
గతంలో మంత్రిగారు హామీ ఇచ్చిన విధంగా, రైల్వే అండర్‌గ్రౌండ్ రహదారి నిర్మాణాన్ని తక్షణమే, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని. రైల్వే ఓవర్ బ్రిడ్జి



కింద సమాంతరంగా ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు గుంతలమయమై ప్రమాదాలకు దారి తీస్తున్నందున, కొత్త సిమెంట్ రోడ్డును తక్షణమే వేయాలని. కరెంటు ఆఫీస్ దగ్గర ఉన్న నంద్యాల–తిమ్మనాయునిపేట ఆర్ అండ్ బి రోడ్డులోని శ్యామ కాలువ బ్రిడ్జిని వెడల్పు చేసి ప్రమాదాలను నివారించాలని వినతి పత్రంలో కోరారు. పై విషయాలకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూక్ ఈరోజు అధికారులతో మరియు నూనెపల్లె అభివృద్ధి కమిటీతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం



జరిగింది. త్వరలోనే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూనెపల్లె అభివృద్ధి కార్యచరణ కమిటీ కన్వీనర్ శంకరయ్య , తోట రాంభూపాల్, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, గుద్దేటి వెంకటేశ్వర్లు, జెపి ,బ్యాంకు తిమ్మయ్య, ధనుంజయుడు, వెంకటరమణ, షేక్ బషీర్, రామకృష్ణ చారి, రమణయ్య గౌడ్ , అధికారులు ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, మెప్మా పీడీ , ఆర్ అండ్ బి డిఈఈ తదితరులు పాల్గొన్నారు.

## మండ్ల గుర్రప్ప సొంత నిధులతో..

# రహదారి నిర్మాణం.

### -నంద్యాల మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మండ్ల గుర్రప్ప.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 21:**
నంద్యాల మండలం చాబోలు గ్రామంలో ముస్లిం మైనార్టీ కాలనీలో రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉండడంతో ప్రజలు చాలామంది ఇబ్బందులు పడుతున్నారని పడడంతో చాబోలు గ్రామంలోనీ ఎం .గుర్రప్ప గుర్రప్ప ఆఫీస్ దగ్గరికి వచ్చి చెప్పడం తో మండ్ల గుర్రప్ప తక్షణమే



స్పందించి న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫారూక్ దృష్టికి తీసుకోపోవడంతో, స్పందించి వెంటనే మండ్ల గుర్రప్ప ఆదేశాలు ఇవ్వడంతో మండ్ల గుర్రప్ప వైట్ వైట్ చిప్స్ వేయించి రోడ్డును పైన ప్రజలు నడిచేలా చేయడం జరిగింది.

# ఎస్ఎఫ్ఐ 4వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:**
భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ముందుగా ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభల లోగోను రామకృష్ణ డిగ్రీ కళాశాల అధినేత శ్రీ రామకృష్ణ రెడ్డి,ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎం.ఆర్.నాయక్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలు నంద్యాల పట్టణంలో డిసెంబర్ 6,7వ తేదీలలో నిర్వహిస్తున్నమన్నారు. డిసెంబర్ 6న ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని దీనిలో వేలాదిగా విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ జిల్లా మహాసభలకు జిల్లా నలుమూలల నుండి 200 మంది ఎంపిక చేయబడిన ప్రతినిధులు పాల్గొని రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై మరియు జిల్లా విద్యారంగా అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నెర కావస్తున్నా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని బకాయిలు ఉన్న ఫీజు రీయింబర్స్, స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని మెస్ ఛార్జీలు పెంచాలని



కోరారు. గిరిజన విద్యార్థుల మరణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని గిరిజన విద్యార్థులకు సమస్యలు పరిష్కరించేందుకు ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు తన శాఖ మినహా అన్ని శాఖల పనులు చేస్తున్నారని విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసారని యువగళం పాదయాత్రలో తను ఇచ్చిన హామీలు కోసం ఆలోచించడం లేదని అన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని జూనియర్ డిగ్రీ కళాశాల కళాశాలల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు ఈ సమస్యలన్నింటిలపై 4వ జిల్లా మహాసభల్లో చర్చిస్తామని తెలియజేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మెడికల్ కాలేజీల సీట్ల అమ్మకానికి వ్యతిరేకించి నేడు అధికారంలోకి వచ్చాక అవే మెడికల్ కాలేజీలను 100% ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా అమ్మడాన్ని వ్యతిరేకించారు. జీవో నెంబర్ 117 రద్దుచేసి స్కూల్స్ మూసివేత ఆపుతామని చెప్పి ఎన్నికల్లో హామీ ఇచ్చి నేడు యదేచ్ఛగా స్కూల్స్ ను మూసేస్తున్నారు అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఎయిడెడ్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే మేము అధికారులకు వచ్చాక ఎయిడెడ్ కాలేజీలను కొనసాగిస్తామని హామీ ఇచ్చి నేడు దానికోసం పట్టించుకునే పరిస్థితి లేదని అదేవిధంగా జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జిల్లా మహాసభల్లో తీర్మానాలు చేసి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించి పనిచేస్తామని తెలియజేశారు ఈ జిల్లా మహాసభల్లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో పాటు రాష్ట్ర నాయకత్వం విద్యా మేధావులు పాల్గొంటారని ఈ మహాసభలను జయప్రదం చేయాల్సిందిగా విద్యార్థులకు ప్రజలకు అదేవిధంగా విద్యా శ్రేయోభిలాషులకు కోరుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివకుమార్,హర్ష వర్ధన్ ఎస్ఎఫ్ఐ నంద్యాల టౌన్ నాయకులు సాయి,సుధీర్,అనిల్,వరుణ్ పాల్గొన్నారు.

# సెయింట్ జోసెఫ్ కళాశాలలో

# వైభవంగా 'రీజినల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్.!

## -ఇంటర్‌స్కూల్ క్రీడలను ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:**
నంద్యాల పట్టణం లోని సెయింజోసెఫ్ పాఠశాల ఆవరణలో రెండు రోజులపాటు జరిగే 'రీజినల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్' శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు ఉద్దేశించిన ఈ ఫెస్ట్ నవంబర్ 21, 22 తేదీలలో నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై, ఇంటర్‌స్కూల్ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాంతీయ స్థాయిలో వివిధ పాఠశాలల నుండి ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొననున్నారు. ఈ రెండు రోజుల్లో ఇంటర్‌స్కూల్ స్పోర్ట్స్ (క్రీడలు) మరియు డ్యాన్స్ కాంపిటీషన్ (నృత్య పోటీలు) నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ క్రీడలు మరియు కళల పట్ల విద్యార్థులను ప్రోత్సహించడం, వారి శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయన ట్రోఫీలు, పతకాలు మరియు ప్రశంసా పత్రాలు బహుకరించారు. అనంతరం నిర్వాహకులు మంత్రి ఫరూక్ ని ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో రీజినల్ సుపీరియర్స్ సీనియర్ టి.జాక్యలీన్, కరసాండెంట్ సీనియర్ ఆనిజెసింతా, రెవరెండ్ ఫాదర్ కె.డి. జోసఫ్, వివిధ జిల్లాల సిస్టర్స్, ఉపాధ్యాయులు, పీటీలు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్మాణ వ్యర్థాలను తప్పనిసరిగా నగరపాలక వాహనాలకే అప్పగించండి

## కమిషనర్ విశ్వనాథ్

**కర్నూలు నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
కర్నూలు నగరంలో నిర్మాణ, గృహ, భవన మరమ్మత్తుల వల్ల ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తప్పనిసరిగా నగరపాలక సంస్థ వాహనాలకే అప్పగించాలని కమిషనర్ పి. విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎక్కడ పడితే అక్కడ నిర్మాణ వ్యర్థాలను పారబోసి నగరాన్ని అపరిశుభ్రంగా మార్చే పనులు ఎవరూ చేయవద్దని హెచ్చరించారు.అగస్టు 1 నుంచి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, నగరంలో కాలుష్య నియంత్రణ మరియు పర్యావరణ పరిరక్షణ చర్యలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు 250కిపైగా ట్రాక్టర్ల ద్వారా నిర్మాణ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు పంపించినట్టు వివరించారు. ప్రతిరోజూ ఉదయం 6 నుండి 9 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 1 నుండి సాయంత్రం 4 గంటల వరకు రెండు ట్రాక్టర్లతో సేకరణ చేస్తుండగా, ఒక్కో ట్రాక్టర్‌కు కేవలం రూ.500 రవాణా చార్జీ మాత్రమే వసూలు చేస్తున్నట్టు తెలిపారు.నిర్మాణ వ్యర్థాలను అప్పగించేందుకు 7422992299 నెంబర్‌కు కాల్ చేయాలని కమిషనర్ కోరారు. సేకరించిన వ్యర్థాలను జోహరపురం డంప్‌యార్డ్‌లోని సి %డ% డి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌కు తరలించి రీసైక్లింగ్ చేస్తున్నట్టు తెలిపారు.






# ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్లో వైభవంగా

# 11వ వార్షిక క్రీడా ఉత్సవాలు.!

- ముఖ్యఅతిథిగా విచ్చేసిన నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్. -ఎస్విఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకట్రామిరెడ్డి.
- ఎస్డిఆర్ వరల్డ్ స్కూల్ మరియు ఆకాంక్ష జూనియర్ కళాశాల చైర్మన్ శనివారపు కొండారెడ్డి. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:**

నంద్యాల పట్టణ శివారులోని వెంకటేశ్వరపురం దగ్గర ఉన్న ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్లో 2025%-%2026 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్ చైర్మన్ కొండా రెడ్డి ఆధ్వర్యంలో 11వ వార్షిక క్రీడోత్సవాలు నవంబర్ 21 తేదీన శుక్రవారం నాడు ఎంతో వైభవంగా నిర్వహించబడాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. ఎం.డి. ఫిరోజ్ , ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జి. రవి కృష్ణ , ఎస్.వి.ఆర్ కళాశాల చైర్మన్ వెంకట్రామిరెడ్డి విచ్చేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు యోగా, కరాటే, పిరమిడ్స్, సంగీతం వంటి అనేక క్రీడలలో మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అన్ని ఆటలకు, అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చిన విధానం ఎంతో ప్రశంసనీయమని అతిథులు అభినందించారు.

ఈ సందర్భంగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. ఒకే వేదికపై ఇన్ని విభిన్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు అందుబాటులో ఉండటం అత్యంత అభినందనీయమని. విద్యార్థుల






అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి. రవి కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉత్సాహాన్ని మెచ్చి, వారికి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మద్దతుతో ఈ క్రీడోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, తల్లిదండ్రులను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమములో ఎస్డీఆర్ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంధి ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్, మాజీ కౌన్సిలర్ కృపాకర్, గోవిందు నాయుడు , సుధాకర్ , పాణ్యం మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి , చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు














# నక్సల్స్ ఏరివేతే కాదు... గిరిజనుల అభివృద్ధి ముఖ్యం !

**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్ పార్టీల వాదనగా ఉంది. ఇది ఎంత వరకు నిజయమో తెలియాలి. ఇదే నిజమైతే దీనికి ప్రజాస్వామ్య పద్ధతిలో లెఫ్ట్ నేతలు కూడా పోరాటం చేపట్టాలి. ప్రజలను సమీకరించాలి. అడవులను నాశనం చేసేవారు ఎంతటి వారైనా నిలదీయాల్సిందే. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నట్లుగా గుర్తిస్తే అందుకు ప్రజా ఉద్యమాలను నిర్వహించాలి. గిరిజనులతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారని అంటున్నారు. లెఫ్ట్ పార్టీలకు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదు. ఇవే నిజమైతే ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరోరూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం కావాలి. అలాగే గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. దీంతో అడవుల్లో అన్నల అవసరం రాకపోవచ్చు. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. ఇకపోత నక్సల్స్ ఏరివేత వెనక ఇదే పరమార్థం అని అంటున్నారు. నక్సల్స్ ఏరివేతతో అటవీ సంపద వినాశనాన్ని ముడిపెట్టరాదు. ఇవి రెండు కూడా వేర్వేరు అంశాలు. అందువల్ల మావోయిస్టులు ఏరివేతను అడవుల సంరక్షణతో పోల్చరాదు. అడవులను కార్పోరేట్లకు కట్టిపెడుతున్నారని ఖచ్చితమైన సమచారం ఉంటే ఎవ్వరైనా పోరాడవచ్చు. ఇకపోతే లొంగిపోవడానికి వచ్చిన నక్సల్స్ నేత హిడ్మాను, ఆన భార్య, ఇతర అనుచరులను మట్టుపెట్టారని, క్రెడిట్ దక్కించుకోవడానికే పోలీసులు ఈ పనిచేశారని వస్తున్న వార్తలపై పోలీసులే నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పోరపాటే. ఎందుకంటే ఖాకీ దుస్తులు వేసుకున్న తరవాత వారికి మానవత్వం అన్నది ఉండదు. నక్సలైట్ ఉద్యమంలో ఎందరో పోలీసులు అసువులు బాసారు. ఎందరో క్రూరంగా హత్యకు గురయ్యారు. మందుపాతరలకు బలయ్యారు. ఇవన్నీ వారు తప్పకుండా పరిగణలోకి తీసుకుంటారు. దీనికితోడు ప్రభుత్వం వారికి టార్గెట్లు విధించింది. అందువల్ల చిక్కిన అవకాశాన్ని వదులుకోరు. అందులోనూ నక్సల్స్ విషయంలో అస్సలు ఉండదు. మనం ఇక్కడ రెండు వైపులా ఆలోచన చేయాలి. నక్సల్స్ కూడా తమ ఉద్యమంలో కిరాతకంగా వ్యవహరించారు. చంపడంలో ఆరితేరారు. ఖతం చేయడమే వారి ఉద్యమంగా సాగింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. మొత్తంగా నక్సల్స్ ఉద్యమంలో రెండువైపులా ప్రాణనష్టం జరిగింది. అమాయకులను ఎందరినో వారు పొట్టన పెట్టుకున్నారు. నేతలను బలితీసుకున్నారు. దీంతో



వారు సాధించిందేమీ లేకపోగా, ఉద్యమం వల్ల దేశానికి తీవ్ర నష్టమే జరిగింది. అందుకే హిడ్మా లొంగిపోవడానికి వచ్చినా పట్టుకుని కాల్చేశారని అంటున్నారు. పోలీసులు అవకాశం కోసం చూస్తారు. అదను చూసి దెబ్బ తీస్తారు. ఇదంతా ఎలా ఉన్నా ఇరువైపులా హింస సరికాదు. నక్సల్స్ కూడా ప్రజల పక్షాన పోరాడడం మాని కేవలం అడవుల్లోనే ఉంటూ హింసాత్మక ఘటనలతో భీతావాహ పరిస్థితులను సృష్టించారు. నిజంగానే ఇప్పటికైనా నక్సల్స్ ఉంటే వారంతా జనజీవన స్రవంతిలోకి రావాలి. ప్రజల పక్షాన సమస్యలపై పోరాడాలి. ఇకపోతే అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే పనిపూర్తయిందని మీడియాలో వస్తున్న కథనాలను చూస్తూనే ఉన్నాం. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కూడా పదేపదే మార్చి అంటూ టార్గెట్ పెడుతూనే ఉన్నారు. అందుకే తాజా రెండు ఎన్‌కౌంటర్లతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని కొందరు అంటున్నారు. నక్స్లకు మద్దతుగా నిలిచిన వారికి ఇది మారణహోమంగానే ఉంటుంది. అదే సందర్భంలో రాజకీయ నేతలను, పోలీసులను నక్సల్స్ అత్యంత కిరాతకంగా హత్య చేసిన పలు సందర్భాల్లో ఇప్పుడు విమర్శలు చేస్తున్నవారు ఏనాడూ స్పందించలేదు. నక్సల్స్‌కు భయపడి వీరంతా మిన్నకున్నారు. నిజానికి ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను ఎవరు అవలంబించినా ఖండించాల్సిందే. ఇకపోతే మరో నక్సల్ నాయకుడు తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. ఇకపోతే రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఎపిలో నక్సల్స్‌ఉన్న జాడలేదు. అందుకే ఈ ఎన్‌కౌంటర్లపై సహజంగానే అనుమానాలు రవాడం సహజం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావో యిస్టులు ప్రాణాలు నేలకొరిగారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు. ఆ హెచ్చరికల నేపథ్యంలోనే ఇవన్నీ సాగుతున్నాయని భావించాల్సిందే. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత అంతా అయిపోయిందనుకుంటే పొరపాటు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించకుండా ముందుకు సాగితే పరిస్థితుల్లో మార్పు రాదని ప్రభుత్వాలు గుర్తించాలి.

## రాయపూర్‌లో మూడ్రోజుల పాటు డిజిపిల సమావేశం

### హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు

రాయపూర్,**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్థవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.

-----------

## నిఖత్ జరీన్ పోలీస్ శాఖకు గర్వకారణం

### గోల్డ్ మెడల్ సాధించినందుకు డిజిపి అభినందనలు

హైదరాబాద **నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తెలంగాణ డీజీపీ బీ. శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఎస్పీ నిఖత్ జరీన్‌ను అభినందించారు. మహిళల 51 కేజీల ఫైనల్స్‌లో తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. 'గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్నాను. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం' అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ కుటుంబం తరఫున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు. ఇదిలావుంటే సీఐడీ విభాగంలో నేర విశ్లేషణ, సాంకేతికత కోసం క్రైమ్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఎనాలసిస్ పేరుతో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాల్లో 'సేఫ్ విలేజ్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు.ఈ మేరకు రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు,
ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై లోతుగా చర్చించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'ను విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.



## అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా

### ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేస్తూ ఆదేశం

న్యూఢిల్లీ, **నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసినట్లు ఫరీదాబాద్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ మరియు ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన సిట్‌యూనివర్శిటీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తోందని అన్నారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్శిటీ వ్యవహారాలను దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేశామని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ఫరీదాబాద్ పోలీస్ ప్రతినిధి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి యూనివర్శిటీకి చెందిన పలువురు వైద్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ర్యాప్తు సంస్థలు క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్యాబ్ డ్రైవర్ ధౌజ్ గ్రామానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు నుహ్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నాయి. సోహ్నా సమీపంలోని రాయ్‌పూర్ గ్రామంలోని షాహిజామా మసీదు నుండి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.




# గవర్నర్లకు గడువు ఉండాల్సిందే

### అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలి -సుప్రీం తీర్పుపై తమిళనాడు సిఎం స్టాలిన్ వ్యాఖ్య

చెన్నై, **నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి,గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించే విధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని వెల్లడించారు.
ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం.. ఏప్రిల్ 8 నాటి తీర్పును (తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్) ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్రభుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీం తీర్పు పునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర



హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపివేయడాన్ని సవాల్‌చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో మే 13న ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని
రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. అయితే తమ వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయడం తగదని, సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అందుకు రాజ్యాంగ సవరణ అవసరమని ఇప్పుడు సిఎం స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

# నాగార్జున సాగర్ కుడికాలువకు గండి

### అధికారులను అప్రమత్తం చేసన మంత్రులు -యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేత చర్యలు

అమరావతి,**నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**
నాగార్జున సాగర్ కుడికాలువ గండిపై ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు అప్రమత్తం చేశారు. సమీప గ్రామాల్లోకి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. గండి పడటానికి గల కారణాలను నివేదిక రూపంలో అందించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల ఆదేశించారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చుతున్నారు. ఆందోళన వద్దని గ్రామస్తులకు సూచిస్తున్నారు. మధ్యాహ్నం కల్లా గండి పూడ్చి వేత పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి పడిన ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అధికారులు
అప్రమత్తమై నష్టాన్ని గణనీయంగా తగ్గించారని పేర్కొన్నారు. గండిని పూడ్చేయటంతో ఇప్పుడు



ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇకపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గురువారం అర్ధరాత్రి గండిపడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఈక్రమంలో అధికారులు అప్రమత్తమై శుక్రవారం ఉదయం గండిని పూడ్చారు.నాగార్జున సాగర్ కుడికాలువ కట్టకు గండి పడింది. కారంపూడి ఎస్కేప్ ఛానల్ వద్ద అర్ధరాత్రి వేళ కట్టకు గండి పడింది. కాలువకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం అంతకంతకూ పెరుగుతూ పోతోంది. వీరుల తిరునాళ్లలో ఏర్పాటు చేసిన దుకాణాల్లోకి నీరు చేరింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు హుటాహుటిన గండిపడ్డ చోటుకు చేరుకున్నారు. గండిని పూడ్చే పనులు చేపట్టారు. ప్రాజెక్టు వద్దే నీటిని నిలుపుదల చేయాల్సి ఉందని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు కట్టను ధ్వంసం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

------------

## మావోలు అద్దెకున్న ఇళ్ల పరిశీలన

### కేబుల్ పనికోసం వచ్చినట్లుగా గుర్తింపు

### ఆరా తీసిన స్థానిక పోలీసులు

ఏలూరు,న **నవంబర్ 21 ఆంధ్ర ప్రగతి**ఏలూరులో మావోయిస్టుల అరెస్టు నేపథ్యంలో వారు నివసించిన ఇంటి పరిసర ప్రాంతంలోని స్థానికులను పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. వీరంతా కేబుల్ పని చేస్తామంటూ ఇల్లు అద్దెకు దిగారు. నెలకు రూ. 10 వేలు చొప్పున అద్దె చెల్లిస్తామంటూ ఆ ఇంట్లోకి మావోయిస్టులు దిగారు. ఆ ఇంట్లో భారీగా మనుషులు ఉన్నా.. వారిలో ఇద్దరు మాత్రమే బయటకు వచ్చి.. ఆహారం తీసుకువచ్చే వారని స్థానికులు వెల్లడించారు. మిగిలిన వారంతా ఇంట్లోనే ఉండేవారని చెప్పారు. అక్టోబర్ 26వ తేదీన మావోయిస్టులు ఇల్లు అద్దెకు తీసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటి యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మావోయిస్టులు ఇల్లు వెతుక్కుంటూ స్వయంగా వారే వచ్చారా? లేకుంటే ఎవరైనా మధ్యవర్తిత్వం వహించారా? అలా అయితే ఆ మధ్యవర్తిత్వం వహించిన వాళ్లు ఎవరనే కోణంలో పోలీసులు.. ఆ ఇంటి యజమానిని ప్రశ్నిస్తున్నారు. వంబర్ 18వ తేదీ తెల్లవారుజామున అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంప చోడవరం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. అదే రోజు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని ప్రధాన నగరాలు విజయవాడ, కాకినాడ, ఏలూరుల్లో మొత్తం 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

# వచ్చేసింది బాలయ్య 'అఖండ 2' ట్రైలర్...
# అంచనాలు పెంచేసింది!

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న హైఓల్టేజ్ చిత్రం 'అఖండ 2: తాండవం' నుంచి ట్రైలర్ విడుదలైంది. 'అఖండ'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై ఉన్న భారీ అంచనాలను రెట్టింపు చేసేలా ట్రైలర్‌ను తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.




'సింహా', 'లెజెండ్', 'అఖండ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ల తర్వాత బాలకృష్ణ, బోయపాటి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం కావడంతో అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో బాలకృష్ణ మరోసారి తన పవర్‌ఫుల్ లుక్‌తో, డైలాగ్స్‌తో ఆకట్టుకున్నారు. **His RAGE is DIVINE His POWER is DESTRUCTIVE%µµ** అంటూ విడుదల చేసిన ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట, బాలకృష్ణ చిన్నకుమార్తె ఎం. తేజస్విని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అఖండ 2 సర్జికల్ స్ట్రైక్', 'అఖండ 2 తాండవం' అనే ట్యాగ్‌లైన్స్‌తో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన 'అఖండ'కు కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 23న 'రాజాసాబ్' ఫస్ట్ సింగిల్..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమా నుంచి కీలక అప్డేట్ వచ్చేసింది. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ ఫస్ట్ సింగిల్‌ను నవంబర్ 23న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారుఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. "విజిల్స్ వేయించే ట్రీట్ తీసుకువస్తున్నాం... 'రెబెల్ సాబ్' గీతం ఈ నెల 23న వస్తోంది" అంటూ చేసిన ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటంతో, ప్రభాస్ సినిమాకు ఆయన ఇచ్చే మ్యూజిక్ ఎలా ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. మొదటి పాట విడుదలతో సినిమా ప్రమోషన్లు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

# అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు జీహెచ్ఎంసీ నోటీసులు




హైదరాబాద్‌లోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థలైన అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు కొరడా ఝుళిపించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపులో భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్టు గుర్తించి, రెండు స్టూడియోలకు నోటీసులు జారీ చేశారు. ఏళ్లుగా వ్యాపార విస్తీర్ణాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువగా చూపిస్తూ, బల్దియాకు చెల్లించాల్సిన ఫీజులో కోత విధిస్తున్నట్టు అధికారులు తేల్చారు. బల్దియా సర్కిల్-18 అధికారులు ఇటీవల జరిపిన తనిఖీల్లో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అధికారిక లెక్కల ప్రకారం, అన్నపూర్ణ స్టూడియో ఏటా రూ. 11.52 లక్షల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ. 49 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు తేలింది. అదేవిధంగా, రామానాయుడు స్టూడియోస్ చెల్లించాల్సిన రూ. 1.92 లక్షలకు బదులుగా కేవలం రూ. 1,900 మాత్రమే చెల్లిస్తున్నట్టు అధికారులు నిర్ధారించారు. ఈ రెండు స్టూడియోలు తమ వ్యాపార విస్తీర్ణాన్ని వాస్తవం కంటే చాలా తక్కువగా చూపడం వల్లే ఫీజులో ఇంత భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు వివరించారు. ఈ పన్ను ఎగవేతను తీవ్రంగా పరిగణించిన జీహెచ్ఎంసీ... బకాయిపడ్డ పూర్తి మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశిస్తూ నోటీసులు పంపింది. వాస్తవ విస్తీర్ణం ఆధారంగా ట్రేడ్ లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలని కూడా స్పష్టం చేసింది.

# వేశ్య పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఇదే: బిందు



మొదట వద్దనుకున్నా, కథ విన్నాక నిర్ణయం మార్చుకున్నానని వెల్లడి

'అవకాయ బిర్యానీ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, ఆ తర్వాత బిగ్‌బాస్ విన్నర్‌గా నిలిచి మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి బిందు మాధవి, తన తదుపరి చిత్రంలో ఓ సవాలుతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఆమె నటిస్తున్న 'దండోరా' సినిమాలో వేశ్య పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఈ పాత్రను అంగీకరించడానికి గల కారణాలను వెల్లడించారు.

మురళీకాంత్ దర్శకత్వంలో, లైక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో, పాత ఆచారాలు, హాస్యం, భావోద్వేగాల కలబోతగా 'దండోరా' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవి కృష్ణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ పాత్ర గురించి బిందు మాధవి మాట్లాడుతూ.. "దర్శకుడు కథ చెప్పడానికి వచ్చినప్పుడు, సినిమా అప్పటికే సగం పూర్తయిందని చెప్పారు. దాంతో నా పాత్ర చిన్నదేమో అని మొదట వద్దనుకున్నాను. కానీ కథ విన్న తర్వాత నా ఆలోచన పూర్తిగా మారిపోయింది. నా పాత్ర ఎంట్రీతోనే సినిమా మొత్తం మలుపు తిరుగుతుందని అర్థమైంది. కథలో అంతటి ప్రాధాన్యం ఉన్న పాత్ర కావడంతో వెంటనే అంగీకరించాను. ఆ క్షణంలోనే ఈ పాత్ర నాదే అని ఫిక్స్ అయ్యాను" అని వివరించారు. సాధారణంగా ఇలాంటి పాత్రలు చేయడానికి చాలా ధైర్యం కావాలని, అయితే కథలో ఉన్న బలం వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని బిందు మాధవి స్పష్టం చేశారు.

# ఏలియన్ వలలో చిక్కిన తమన్నా..



తనదైన గ్లామ్, డ్యాన్స్ మూవ్స్ తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టించే అందాల భామ తమన్నా ఇప్పుడు ఏలియన్ చేతికి చిక్కింది. ఇప్పుడు ఏలియన్ వల నుంచి విడిపించడం ఎలా?.. ఇదిగో ఇక్కడ తమన్నా ఫ్యాషన్ సెన్స్ చూశాక, యూత్ ఫీలింగ్ ఇది. ప్రయోగాలు చేయనిదే కొత్తదనం సాధ్యపడదు. ఫ్యాషన్ ప్రపంచంలో సృజనాత్మకతకు అంతూ దరీ లేదనడానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. తాజాగా తమన్నా ఎంపిక చేసుకున్న ఆల్ బ్లాక్ డిజైనర్ డ్రెస్ చూడగానే, ఎవరు ఈ ఏలియన్ సుందరి? అనే సందేహం కూడా కలుగుతుంది. ఇతర గ్రహం నుంచి ఈ భూమ్మిదికి వచ్చిందా? అంటూ మాట్లాడుకునేంత ట్రిక్కీగా కనిపిస్తోంది. పండోరా గ్రహం మీద దిగిన ఏలియన్ కన్యలాగా కూడా కనిపిస్తోంది! అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. మొత్తానికి తమన్నా ప్రయోగం సూపర్‌హిట్ అయింది. ప్రస్తుతం ఈ యూనిక్ లుక్ ఇంటర్నెట్ తుఫాన్ లా దూసుకెళుతోంది. తమన్నా కెరీర్ మ్యాటర్ కి వస్తే, అటు ఉత్తరాది సహా దక్షిణాది సినిమాలతో కెరీర్ రన్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం నాలుగు సినిమాలతో మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా ఉంది. అజయ్ దేవగన్ సరసన రేంజర్ అనే చిత్రంలో నటిస్తోంది. రోమియో, వివాన్ అనే చిత్రాలతోను బిజీగా ఉంది. రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ డ్రామాలోను తమన్నా నటిస్తోంది.



# రాజమౌళికి మద్దతుగా ఆర్జీవీ..



ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి వివాదాస్పద డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మద్దతుగా నిలిచారు. దేవుడిని నమ్మే హక్కు ఎంత ఉందో, నమ్మకపోవడానికీ అంతే హక్కు ఉందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ఇదే విషయాన్ని చెబుతోందని ఆయన స్పష్టం చేశారు. రాజమౌళిని విమర్శిస్తున్న వారిపై వర్మ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన కొత్త సినిమా 'వారణాసి' టైటిల్ లాంచ్ కార్యక్రమంలో రాజమౌళి మాట్లాడుతూ, తనకు దేవుడిపై అంతగా నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో పలువురు ఆయనను విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆర్జీవీ తన 'ఎక్స్' ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "రాజమౌళిపై విషం కక్కుతున్న వారు ఒకటి తెలుసుకోవాలి. భారతదేశంలో నాస్తికుడిగా ఉండటం నేరం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం నమ్మకపోవడానికీ హక్కు ఉంది" అని వర్మ తెలిపారు. "దేవుడిని నమ్మకపోతే ఆయనపై సినిమాలు ఎందుకు తీస్తున్నారన్న వాదన అర్థరహితం. ఆ లాజిక్ ప్రకారం గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే దర్శకుడు గ్యాంగ్‌స్టర్‌గా మారాలా? దెయ్యం సినిమా తీయాలంటే దెయ్యం అవ్వాలా?" అని ప్రశ్నించారు. దేవుడిని నమ్మకపోయినా, దేవుడే రాజమౌళికి వందల రెట్ల విజయాన్ని, సంపదను ఇచ్చాడని వర్మ అన్నారు.

అసలు సమస్య రాజమౌళి నాస్తికత్వం కాదని, పూజలు చేసి కూడా విఫలమైన వారిలో ఉన్న అసూయేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విమర్శల వెనుక ఉన్నది దైవభక్తి ముసుగులో ఉన్న అసూయ మాత్రమేనని వర్మ తేల్చిచెప్పారు. 'వారణాసి' సినిమాతో రాజమౌళి బ్యాంకు బ్యాలెన్స్ మరింత పెరుగుతుందని, విమర్శకులు అసూయతో ఏడవవచ్చని తన పోస్ట్‌ను ముగిస్తూ చివర్లో 'జై శ్రీరామ్' అని పేర్కొన్నారు.